

## కొత్తపల్లి సూర్యారావుగారు

[వెనుకటిసంచిక తరువాయి]

### పదునాలుగవ యంకురము

తరువాతఁ జేయి కదపి యెత్తి కన్నులు మూసికొనియే నాకంఠము గౌఁగిలించుకొని మఱియైదు నిమేషములు పైఁగా మిన్నక యుండిరి. ఆసందర్భములో వీథి తలుపు తెఱచియున్న దేమో యని జాలగవాక్షములలోనుండి యెవ్వరైనఁ జూచెదరేమోయని- నేతిగిన్నె మీఁది మూఁతయో, పాలగిన్నెపైనున్న సిబ్బెయో పిల్లి పడఁద్రోయుచున్నదని గణింప నాకుఁ దోఁపలేదు. చెక్కునఁ జెక్కునేర్చుట, ఆస్పర్శసుఖము, వీనిలో వారిహృదయములోనిది దుఃఖమో, సంతోషమో నే నెఱుఁగను. ఆందోళనము లేదు; నిరాలోచనము, స్తంభీభావము. ఉత్తరము వాయువశమున నెగిరి క్రిందఁ బడఁబోయి యొక్కపోరువ పెద్ద గవ్వక్రిందఁ దూఱిపోలేక ముందు ముమ్మాఱు చంకలుకొట్టుకొనుండని చెప్పునట్లు, పావురాయి ఱెక్కగొట్టినట్లు గవ్వమీఁద టపటపఁ గొట్టుచున్నది. ఏమిసంగతి, విషయమేమి యని యడిగినఁ బ్రత్యుత్తర మిచ్చుటలో నాలింగన విశ్లేషమున వారేమి తలంతురో యనుభయము.- అసమయ సమయీకరణమునకు వెనుబాటు- కానిమ్మంటిని. కన్నులు తెఱచినారు. నేను వారిమొగమువంక సుఖదుఃఖపరామర్శము గానిదృష్టితో- మీదేహ మెట్లున్నది. ఏల యిట్లయితిరి. జాబులో నేమైనఁ గష్టప్రసంగ మున్నదా- అని మెల్లమెల్లగఁ దప్పించుకొనుచు-మోమునఁ గ్రమ్మిన చెమ్మటఁ బైఁటకొంగునఁ దుడిచి, గవాక్షమున కెదురు లెండు, గదిలోఁ బండుకొనుఁడు- అని చేయిపట్టుకొని లేచుటకు సహాయము చేసితిని. నిట్టూర్చిరి. నన్నుఁ జూచి యరుణోదయమునఁ బ్రయత్నించి సూర్యోదయ మగునప్పటికిఁ గ్రమక్రమముగా నొక్కొక్క ఱేకుగ విడిపడి యుత్ఫుల్లమైన పద్మమువలె నాననమును గ్రమాభివృద్ధిగా నానంద పరిపూర్ణము చేసి లేచి నిలువఁబడి- ఉత్తరము నీవు చదువలేదా యనిరి. లేదు, హిందీవ్రాఁత నాకుఁ జక్కఁగాఁ దెలియదు. అచ్చొత్తకరీతిగా నీడ్చెదను. కలిపివ్రాసినవ్రాఁత నాకు బొత్తిగాఁ దెలియదు. మీరు చెప్పరాదా? దానిలో నేమున్నది అని దుఃఖవార్తలు లేవను ధైర్యముతోనుంటిని.

ఏదో ముష్టివానిచేతిలోఁ బడవైచినట్లు-గోపిగానిని దిట్టుచుఁ దిట్టునుఁ నాలుగణాలు పంపియున్నార మెఱుఁగుదువుగదా! ఎఱుఁగుదునుగాని దానిప్రచారమింక నన్నెఁడును రాదని మఱపుచెందియుంటిని. ఆనాలుగణాలతో మనకు వాఁడు, దైవము మనకు మేలుచేయవలయునని చేసినప్రార్థనపై-దైవము మన కైదువేల రూపాయలు పంపి యుండెనఁట. నన్నువచ్చి పట్టుకొని పొమ్మని వ్రాసినాఁడు. అయ్యో యిది యేమిచిత్రము! మనము ప్రతిఫల మపేక్షించి యిచ్చినామా? నాలుగణాల కైదువేలేమిటి, వాఁ డెట్లుగడించినాఁడు! మీకేమైనఁ దెలియునా!!

లాటరీలో వేసినాఁడఁట! లాటరీయేమిటి నాకుఁ జెప్పరు? దానికేమిపోనీ, మనకు దైవమిచ్చినాఁడు-మీమాటలన్నియు నింతలే! ఎన్నఁడైనను మనకు దైవముగాని మఱియెవ్వరుగాని యైదువేలుపంపుదురని యనుకొన్నారా మీరు? ఒకరిచ్చెదరని వేయిజన్మములెత్తియైననిల్లంతయుఁ గొట్టినఁదట్టెఁడు పెంకులు లేని మనము గడించి కూడఁబెట్టుదుమని కాని యనుకొంటిమా? లేదుసుండీ! ఆగోపిగానిని పాపము శాపనార్థములు పెట్టి, తిట్టి యర్ధాంగీకారముగాఁ బంపినాము. అమ్మ! సుండకొడుకా! నీ వెంతటివాఁడవురా! నిన్నువలె మేము పోయినను నీవుమమ్ము వదలక పింగళివారి పేకీవలెఁ బట్టుకొన్నాఁడవని తిట్టినాము. నీయిల్లు వేయిండ్ల మొదలు గాను! నీకు మఱుమేలు మేమెట్లు చేయఁగలము! ఈఁత గింజయిచ్చి నీయొద్దనుండి తాటిగింజ లాగినాము రా! నేను బెట్టిన యేకందిపప్పు పచ్చడియో వానికిగుండెకాయలోఁ గృతజ్ఞత కనఁబఱుపుమని నాటినది. ఏమిదారి! యెట్లు తెచ్చుకొందుము. ఎట్లు కాపాడుకొందుము. దీనికా మీరింత నిర్ఘాతపడినారు. నే నదృష్టవతిని. ఎవ్వరో ముసలమ్మ యేకులు వడుకుకొనుచుండఁగా బండ్లమీఁద రూపాయలసంచు లింటికివచ్చిన మొక్కలి పీఁటమీఁదనుండి క్రిందఁబడి-యేమో చెప్పుకొందురు లెండు. "నిరుపేద కర్దంబు సెరయఁగల్గినయట్లు"- అని రామాయణములో నున్నది. వెఱ్ఱివాఁ డెవ్వఁడో, పాపము-"అర్థానామార్జనం దుఃఖ"మ్మన్నాఁడు. మనమార్జించుటలో నేమి దుఃఖపడినారము. వెఱ్ఱిదానా! నాలుగణాలీయక మన మెంతకష్టపడినామో యెఱుఁగవా! ఇంకను జూడుఁడు. తద్రక్షణో అన్నాడు. దానిని గాపాడుకొనుటలోను దుఃఖమే. మనకుఁ జీట్టెలా బేడలా యెక్కడఁ దాఁచెదము. ఎట్లు వినియోగింతుము. నన్ను మూఁడునాళ్లు సెలవుపుచ్చుకొనివచ్చి తీసికొని పొమ్మనుచున్నాఁడు. సెలవు దొరకుట యొకకష్టము. ఏదీ యింకను సొమ్ము మనయింటికి రాలేదు. దానిఁగూర్చి యిప్పటినుండి యాలోచనము.

ఏమి చెప్పుదును. మేము మొదటఁ దెచ్చిపెట్టుకొన్న ప్రసంగాంతమున నీసంతోషవార్త మమ్ముఁ బరవశులఁ జేసినది. పరమానందములో-నాపూఁట వంటప్రయత్నము చేయనేలేదు. మానవున కున్నది పుష్టి-మాలో మేమొకరితో నొకరు గుసగుసలు-ఏమండీ! మీరు వెళ్లెదరా! మీరు వెళ్లకపోయిన నెట్లు వచ్చును! వెళ్లకతీరదు సెలవునకు వ్రాసెదను. ఇది యెంతవఱకు నిజమో! ఇందబద్ధ ముండదు. దొంగలువడి యింటిలోని లొడ్డులొసుకు పట్టుకొనిపోయినారని వ్రాయలేదా! అట్టిదిగా నుండదు. ఏమయినను, సొమ్ము మనచేతఁ బడుదాఁక నొక్కరికిఁ దెలుపఁగాదు. నీకు నోటిలో నూవుగింజ నానదు. అయ్యోయ్యనయము! మీరు చెప్పుమన్నదాఁక నేనొక్కరితోను జెప్పను. ఎప్పుడును జెప్పను. నాకేమిపని-ప్రత్యక్షముగాఁ బందెములో వచ్చినసొమ్ము-పరులకుఁ దెలియకుండ నుండదుగాని మననోటఁ దెల్పము. ఎవ్వరికిఁ దెలియకుండ నైదువేలు-అయిదుసంచులు మీరెట్లు తేఁగలరు! మునుపటివలెఁ గాదు-జేసెఁడేసి కాగితము ముక్కలైదు-బరువుండదు. ఏమో యిదియు దొంగమాట - ఆకాశరామన్న యేమో వ్రాసియుండును. అని నేను నవ్వితిని. "పోనీలే, నీవు పుచ్చుకొనకుము" అన్నారు. నాకెపుడును వలదు. మీకేకాని యాఁడుదానికి నాకెందుకు, చీఁపురు లేదండీ యనిన మీరే యిచ్చెదరు. గరిటె పోయినదనిన మీరే కొందురు. నాకాబరువువలదు బాబు! మీరే తెచ్చికొనుఁడు. మేడ గట్టుకొనుఁడు- చిరంజీవులైయుండుఁడు. మిమ్ముఁ జూచి యానందించుచుండెదను. నాకదే చాలు నంటిని. ఆదినమును, సెలవు వచ్చువఱకు మఱిరెండు దినములు మాయానందమునకు మితి మేర యని లేదు.

సాంసారికమైన యొకపనిమీఁద సెలవుకావలయునని కోరిరి. పాపము సెలవు వచ్చినది. నన్నొంటిగా విడిచిపోనేల యని వెంటఁ గొనిపోయినారు. మాకు రెండుగంటల ప్రయాణము-చేరినాము. పూర్వపరిచితుల నందఱిం గలసికొని సుఖగోష్ఠి గడపినారము. కలకత్తావారికిఁ, జుట్టుప్రక్కలవారికిని సంవత్సరములో నొకటి రెండు మూఁడుమాసములు లాటరీలు గుఱ్ఱపుఁబందెముల వెఱ్ఱి యెక్కుడు. ఒకొక్కయాఁడుది మగవాఁడు సంవత్సరము పొడుగున నెట్లో మిగిల్చి మూఁడునాల్గురూపాయలు పందెములోఁ బెట్టెదరు. వచ్చినవారికి వచ్చును. "ఎంత యోటువడిన నంతియ జూదంబునందుఁ దగులు-" అని నలచరిత్రములో నలునిఁగూర్చికలదు. నలు నంతటివానికి, ధర్మరాజునంతటివానికి జూదమువెఱ్ఱి యుండఁగాఁ దక్కినవారి లెక్కయేమి. జూదము, పందెము, లాటరీ యివి యన్నియు

నొక్కటే యర్థమున గ్రహింపవచ్చును. ఒక్కరూపాయకు రెండుమూఁడురూపాయలు వచ్చినవాని చొరవ చెప్పవలయునా - ఆపందెములలో లక్షలకొలఁది కోట్లకొలది సొమ్ము పోగుపడును. వచ్చినదానిలో సహస్రాంశమును గెలుపు చీటులక్రింద వినియోగింతురు. ఎవ్వరికిఁగాని యిట్టిపందెములు, చీట్లాటమొదలగు వానిలో దిగిన యెడల మర్యాద చెడిపోవును. మాచుట్టమొక్కరు- గునుపూఁడి మామయని పిల్చువారము - పేకయాట వెఱ్ఱిగలవాఁడు. సంక్రమణము వచ్చెనా విశాఖపట్టనముజిల్లా వారికంటె నెక్కుడు వెఱ్ఱి. విశాఖపట్టనముజిల్లావారి వెఱ్ఱి, యేమందురా? పండుగ కల్లుఁడు బోగినాఁటికే యత్తవారింటికిఁ బిలువఁబడును. అమ్మలక్కలు నీలాటి రేవులలో - మీ యల్లునకీ సంక్రాంతిపండుగకు మీవా రేమిచ్చినారని, మీరేమిచ్చినారని యడిగి, చెప్పకొనుటలో-మూఁడునాఁళ్లు మూఁడుపిండివంటలు, మూఁడు జేమారులు, మూఁడువరాలు పేకాటకు నిచ్చినారము. ఈదినములలో సంసారులకు మనకు దినమునకు వరాకంటెఁ జేకాటకిచ్చుశక్తి యెక్కడిదమ్మా-అని చెప్పకొందురు. నాయనా పేకాడుకొమ్మని యల్లునకు డబ్బిచ్చి, పండుగనాళ్లలో నింటిలో నలువురతోఁ జిల్లుబొల్లుమని యుండనీయక,-భార్య, బావలు, మఱఁదులు, మఱఁదండ్రు, వినోదముగాఁ గథలతోఁ గాలక్షేపము చేయనీయక, చీట్లాటకుఁ బంపుదురు. వారు పోయి యే కోమటిపేటలోనో, యేతురకవీథిలోనో మూఁడునాళ్లు, రాత్రియిది, పగలిదియని యెఱుఁగకుండ నాడి యోడుచుందురు. భోజనమునకు వేళకుఁ బిలుచుటకు-అయ్యా, బావయ్యను బిలుచుకొనిరమ్మని కుఱ్ఱవానిం బంపెదరు. ఓడుటచేతనో, గెల్పుసంబరము లోనో బావకదలిరాఁడు. పిలువఁబోయిన పీరుసాహెబు నక్కడనే కూర్చుండును. ఇంటియొద్ద నల్లమందు మామగారికిఁ గాళ్లుతీతలు, కునికిపాట్లు, ఆవలింతలు-ఇది విశాఖపట్టనము జిల్లాలోఁ బేకాటవెఱ్ఱి.

గునుపూఁడిమామవెఱ్ఱియు నట్టిదే- ఒక్కొక్కనాఁడాటకు దొరకించుకొన్నాఁడా యింటిమాట మఱచిపోవును - తెల్లవాఱిన మా తాత తద్దినము, ఆటసందడిలో జాముప్రొద్దెక్కి వచ్చినాఁడు. ఒక్కచేస్తు విషయములో తగవు పడినది. ఒకనాయఁడుగారి చేస్తీయన గెల్చినారు. ఇంకొక పంపకము కుదేలులోఁ దగవు పట్టుకొన్నది. పనసాకు గట్టఁబోయినారు. నే నీయనన్నాఁడు. కళ్లుపెళ్లుమన్నారు. ప్రక్కనున్న నాయఁడుగారు కుర్చీయెత్తి మొగమునఁ బెట్టి కొట్టినాఁడు. ఒక్క దవడ వాఁచినది. ఒక్కపల్లు కదలినెత్తురువచ్చినది. జేగురుకొండవలె నింటికివచ్చెను. నాకు బాగుగా జ్ఞప్తియందున్నది. ఒక్కసారి యొక్క తురకసాహెబు మేము త్రాగుఁబోతుగడేకార్లీషుండకొడుకులము; నీవు చదువుకొన్న బ్రాహ్మణుఁడవు: మాతో నీకీ జూదమేల యని యూచిపుచ్చుకొని దవడమీఁద పీర్లపంజా నిల్పినాఁడు. అయినను మా మామయు మానలేదు; బుద్ధిచెప్పిన సాహెబును మానలేదు.

కలకత్తా బంగాళీవారి కింతకంటె లాటరీవెఱ్ఱి. ప్రతిసంవత్సరమును దండుగపడుచున్నను మానరు. ఎక్కడనుండియో 'ఐదురూపాయల చీటితెచ్చినారు ఆగరపారాష్టేషనులోనివారు-ష్టేషనులోని మేష్టరులు మొదలయినవారు తలాయొక్క నాలుగణాలు వంతునఁ జీటికిఁబాలుగూడినారు. గోపిగాఁడు తనకు రెండణాలే వేసికొన్నాఁడు. అప్పటికింకను నాలుగణాలభాగము దిగఁబడినదఁట-తక్కినవారు సర్దుకొనవచ్చునా; అబ్బ నాకువలదు నాకువలదని యాభాగము నట్టెయుంచినారఁట. అప్పుడు గోపిగాఁడు మమ్ము జ్ఞప్తికిఁదెచ్చుకొని నేను దెచ్చియిచ్చెదనని-చిన్న మేష్టరుగారి యాఁడువారియొద్దఁ జేబదులు పుచ్చుకొని యిచ్చినాఁడఁట. అదృష్టమనఁగా నర్థమేమి! ఇదియే, ఇట్టిదియే. అది యెంత మొత్తమువచ్చినదో నే నెఱుఁగనుగాని-మాగుఱ్ఱము మాగెల్పుకు 5000 రూపాయలిప్పించినది. మేము వెళ్లిన సాయంకాలమే వ్యవహారము తీర్పయినది. మేము రహస్యముగా గోపి - మర్దను గృహమునకు వెళ్లి వాని బిడ్డపాపలను జూచి వానిని బొగడిన పొగడ్తకు మితములేదు. మే మెంతో బతిమాలినారము. మాదానిలో నొక్క కానిదో యర్ధణాదో వంతు పుచ్చుకొమ్మన్నారము- నాదానిలోనుండి పుచ్చుకొమ్మన్నాఁడు గాని మామాటకు సమ్మతింపలేదు. ననేమిరా-అని, తృప్తిపొందినాఁడు - తృప్తిలేనివానికిఁ బ్రపంచమంతయు దొరకినను సంతోష ముండదు. వాఁడు

మాపాలింటికి దేవుఁడైనాఁడు. ఒక్కనాఁడు ముందుగానే తిరిగివచ్చితిమి. ఎట్లో యిది పొక్కినది. యందఱకుం దెలిసినది; సంతోషించిరి. మాకేమిలేదా, మేమొక్క తాంబూలమునకైన నోఁచుకొనలేదా యని పెద్దపెద్ద వారు మమ్ముఁగాంచి నవ్వుచుండిరి. మాస్నేహములోనున్న వారందఱకు నొక్కనాఁడుపాలుపండ్లు విందుచేసినారము.

ఈవృత్తాంతము మాయింటికి వ్రాసినారు. తమ యింటికి వ్రాసినారు. దీని నెట్లు వినియోగించుటయని పెద్దయోజన-ఊరక యింటఁబెట్టుకొన్నఁ బ్రయోజనము లేదు. కొలువపట్టి నొక్క భూమి కొందమా-ఇల్లు కట్టింతమా-ఇందు నీకెంత కావలయునో తీసికొమ్ము, మిగిలిన దానిని నాయిష్టమువచ్చిన ట్లుపయోగింతు ననిరి. నాకొక్కదమ్మిడి వలదంటిని. నీవనకున్నను - మన నానీ మొదలైనవారు నీపెండ్లమునకు నగలులేవో లేవో యనుచున్నారు. వేయిరూపాయలనగలు చేయించుకొమ్మనిరి. మొత్తో నాకు వలదంటిని-మానలేదు. అట్లయిన, నీదేశపు నగలుగాదు. మనదేశపువి మూఁడో నాల్గో చేయింపుమంటిని. కాని, నగలు నా కిష్టములేదు. తప్పినదిగాదు: ఒక్కకంటె, రెండుజతల గట్టిమురుగులు, గడియారపుజంటపేరు, దండకడియములు, నొక్క మంచి యుంగరము జేయించిరి. రెండువేలు నాయుపదేశముమీఁదనే - ఆషుబాబుగారియొద్దకిఁ బట్టుకొనివెళ్లి యిచ్చి-దీనిని మీయొద్ద నుంచి నన్నుఁ దెచ్చినట్లే దీనినిగూడ వృద్ధిలోనికిఁ దెమ్మనిరి. ఆమహారాజులకు రెండువే లొక లక్ష్యమా! సంతోషముగాఁ బుచ్చుకొన్నారు. వారము దినములైన పిమ్మట-నొకకాగితము వ్రాసి పంపినారు. అందు 100 కి రు. 1 చొప్పున నెలనెలకు వడ్డీ యిచ్చుచుందుమని కలదు. తర్వాత నెలనెలకు నిరువదిరూపాయలు మాకుఁ బంపుచుండువారు. మూఁడువేలయినవిగదా! ఒక్కవేయి తండ్రిగారికిఁ బంపిరి. మామగా రాధనముతో స్వగ్రామములోనున్న పిత్రార్జితమునకుఁ గాడిగట్టినఁగల భూమి కొంత కొనిరి. మిగిలిన వేయి యేమి చేయుదునా యని యూహ- అయిదువందల రూపాయలు మాతండ్రిగారికిఁ బంపించినారు. వద్దువద్దని నేను - మానాన్న కెందుకు - ఏకారణముచేత నాయన కిందులో భాగము పంపవలయును. ఏమి సంబంధ మంటిని-పుచ్చుకొననే పుచ్చుకొనఁడు వలదంటిని - పంపినారు. నూఱురూపాయలు లక్ష్మికి నూఱుగౌరికి - పంపియొక్క నూఱుతో గట్టియినుపపెట్టెఁగొనిరి. మిగత రెండువందలలో నేవేళ కేమి యవసరమో యని పెట్టెలో సర్వదా నూఱు నిలువయుండున ట్లుంచినారు. తక్కిననూఱుతోఁ దాము చేతిపెట్టెయొక్కటి-కొన్ని మంచిదుస్తులు, రామాయణము భారతము భాగవతము-ఆనందావారివి కొన్నారు. సెనగలు దిని చేయి కడుగుకొన్నారము.

నెలకుఁ గొంతజీతముగాక - యిరువదిరూపాయలు వడ్డి యొక్కటి పెచ్చు-ప్రతినెలలోను మామగారికిఁ బది రూపాయలు ధారాళముగాఁ బంపఁగలిగిరి. కొంత తమ జేబులో-ఒక్కరూపాయ బీదకుఱ్ఱవాని బడిజీతము-గ్రుడ్డి పిల్లకొక్క-దానికి రూపాయ - ఇంటివెచ్చము, మిగిలినది బీదసాద-కాని యర్ధణా.

గ్రుడ్డిపిల్ల వృత్తాంతము మీరు వినఁదగినదియే. పాత్రోగారని యొక్క ధనికుఁడున్నాఁడు. ఒక్కకొడుకు ముగ్గురుకూఁతుండ్రు. రెండవకూఁతురు పుట్టుగ్రుడ్డిది. కన్నులు కనుబొమ్మలు నాకారమే లేదు. బంధుజాలమెంతయో యున్నది. వచ్చుచుఁ బోవుచుందురు. ఈపిల్లం జూపుటగాని, యిది మాబిడ్డయని చెప్పుటగాని వారికి సిగ్గుగాఁ దోఁచినది. పెండ్లియీడు వచ్చుచున్నది. ఎవ్వరికి నక్కఱలేదు. దీనికిఁ బెండ్లికాకున్న మూఁడవదానికిఁ గాదు. ధర్మసందేహము వచ్చి - నెలలతరబడి నూహించి పాత్రోగారు, తుదకొక్కనాఁడు ప్రేమపాశముం ద్రెంపివైచుకొని నిద్రపోవుచున్నదాని నట్టి యొక్క ముష్టివానికిఁ గొన్నిరూపాయల దక్షిణతోఁ గన్యాదానముచేసినారు. వాఁ డెత్తుకొనిపోయి,-నాయనా గ్రుడ్డిదానిని జూడుఁడు. కన్నులు లేవని-కన్నులు లేకున్నఁ గలియుగము లేదని, బాజారులోఁ బెట్టి ముష్టియెత్తసాగును. తెల్లవారి, ధర్మసత్రముకడఁ జెట్టుక్రింద వంటచేసికొనిరి. యేవో దానికిరుచింపని మాంసాద్యాహారములు పెట్టఁబోయినారు. తినననని యేడ్చుచున్నది. బలవంతపెట్టుచున్నారు. ఎంత గ్రుడ్డిదియైనను గ్రొత్తచోటు, క్రొత్తమనుష్యులు, కనిపెట్టినది. కన్నులు లేవుగాని తక్కిననాల్గింద్రియములు పని చేయుచున్నవిగదా!

తల్లిదండ్రులు చేసిన మోసము తెలిసికొన్నది. జనులందఱును జేరి యీముష్టివానికి రూపముగల

బిడ్డ పుట్టియుండునా: యేల యేడ్చుచున్నదని యారయఁజొచ్చిరి. నేఁడేమో మాపిల్ల తిండితిననని పట్టుపట్టినదని వారు వచ్చినజనులతోఁ జెప్పుచుండిరి. దానియాకృతి, మాటలు, బిచ్చగానిది కాదిదియని యందఱకుఁ దోఁచుచున్నది. ఆదారిని మావారను జిన్న మేష్టరుగారును నూరులో నేదోస్వకార్యమునకై పోవుచుండిరి. తామును గొంతసేపు నిల్చిచూచిరి. వీరిప్రశ్నలను మాటలను గుర్తించి నాయనా నన్నిట్లుచేసినారని యాపిల్ల చెప్పినది. హాహాయని సకలజనులును విలపించిరి. బిచ్చగాని యొద్దినుండి పిల్లను బుచ్చుకొనిరి. దానిచెప్పినమాటలను బట్టి శాస్త్రోగారియూరి కర్థరాత్రమున బండిమీఁదఁ బోయిరి. చీవాట్లుపెట్టిరి. నిందించిరి. నీకడుపుకాల, నీకువచ్చినయేం డ్లెవ్వరికివచ్చినవి. మే మేగనుక జోక్యము కలిగించుకొంటిమా నీకు శిక్షయగునని భయపెట్టిరి. చినరకుఁ బాత్రునిచేతి కొప్పగించిరి. నీవు నీయింటనుంచుకొనుట కిష్టపడవేని-దూరముగా నొకయింటిలో ...రి తిండి పెట్టుము. ఇతరులబిడ్డలను గాంచినసే ... ము. నీబిడ్డను విడిచిపెట్టి జాలిలేక యెట్లున్నావు. కుంటిదో గ్రుడ్డిదో నీబిడ్డ నీకుఁ దప్పదు. అయినయింటిబిడ్డ బిచ్చగానిపాలుగానా! అనిరి. నాయనలారా నాకు మాతలిదండ్రులయొద్ద నుండ నిష్టములేదు. నాయందుఁ బ్రేమలేని వీరియొద్ద విడుచుటకంటె నన్నే కూపములోనో విడువరాదాయని కన్య యేడ్చినది. బిచ్చగాని యింటనుండి వచ్చిన దానిని నాయింట నెట్లుపెట్టుకొందునని ధర్మశాస్త్రములు చూపించిరి. దుర్మార్గుఁడా పొమ్మని పిల్లను దీసికొని వచ్చి మేమున్న యూరిలోనే యొక పేదరాలు పెద్దమ్మకిచ్చి-మీయిద్దఱను మే మన్నము పెట్టెదము. నీవు సాటికులముదానవు. మీరు హాయిగా నుండుఁడు. అనిసమాధానపఱిచి తలకొక్క రూపాయివేసికొని పెద్దమ్మ కిచ్చుచు, గ్రామాధికారులపై పరామరికకు లోనుజేసిరి. శాస్త్రోగారును జింతించి గ్రామస్థులకడకుఁ గొంత నెలనెలకు బంపఁజొచ్చిరి.

మాతల్లిదండ్రులు చేసికొన్న పుణ్యమో, వారితల్లిదండ్రులు చేసికొన్న పుణ్యమో చెప్పలేము. మాయిద్దఱి నెవ్వరు చూచినను దమబిడ్డలవలె గౌరవించుట-సజ్జనుల నొక్కసారి స్తుతింపవలసినదియే. నేను నోఁచిననోము ఫలము కావచ్చును. మే మెట్టివారమో మాలో మేము తెలిసికొనలేము. మమ్ముఁ జూచినవారెల్ల మమ్మెట్లు భావింతురో యమితవాత్సల్యముం జూపుదురు. మాముఖములలో నేమియులేదు. వారిహృదయములోనే యేదో యపూర్వవస్తు వుండవచ్చును. భోజమహారాజుం జూడఁగానే కవిత్వము పుట్టినట్లు వారిని జూడఁగనే మాహృదయములలో వినయ ముప్పతిల్లుచుండును. ఇదియే దీని రహస్యము. విద్యావంతుఁడా, పెద్దకులమువాఁడా, పూర్వసంబంధమేమైనఁ గలదా. గోపీకుచమర్దనుఁడు మాపైఁ జూపు నభిమానము-కొన్ని నాళ్లు నలువురితోపాటు, మావారును దనకు నధికారియనియేనా కారణము. వీరిచేతి ధనమిచ్చినారా, వీరియింటఁ బనిచేసినాఁడా. ఎందఱెట్టి ష్టేషనుమాష్టరులు వచ్చినారు, వెళ్లినారు! వచ్చువారి గంపదింపుచున్నాఁడు, వెళ్లువారిగంప యెత్తుచున్నాఁడు. మాయందే యింతవిశ్వాసమా. తక్కినవారియందున్నదా. మాతో నెన్నఁడును వెనుకటి యుద్యోగులప్రసంగమే చేయువాఁడుకాఁడు. ఇంతటికి మాపై ననురాగము పుట్టుచుండుటకు—వారి మంచిహృదయములే కారణములుగాని మాలో నేమిరహస్యమైన మాహాత్మ్యము నుండదు. ఇట్టిసజ్జనచక్రములో మమ్ముఁ బడవైచినందుకు మాయమ్మను నొక్కసారి ధ్యానించుచున్నదానను.

